

కలశ ఉత్సవం.. పరవశం



శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిసినా భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు అమ్మవారి మాలలు ధరించిన మహిళలు సోమవారం కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.
– ఈనాడు, నెల్లూరు

జోరు వర్షం..

- స్తంభించిన జనజీవనం
- చలి తీవ్రతతో అవస్థలు

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున మొదలైన వాన.. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురవడంతో.. జన జీవనం స్తంభించింది. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో.. వర్షపు నీరంతా రోడ్లపైకి చేరింది. నెల్లూరు నగరంలోని సండే మార్కెట్, గాంధీబొమ్మ కూడలి, ఏసీ మార్కెట్, శ్రామిక నగర్, చంద్రబాబునగర్, వైఎస్‌ఆర్ నగర్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి దగ్గర ప్రజలు అవస్థలు పడ్డారు. తర్వాత కాస్త తెరిపి ఇవ్వడంతో.. అధికారులు కాలువల్లో అడ్డంకులను తొలగించారు. సోమవారం వేకువజాము నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 96.8 మి.మి. నమోదు కాగా.. అత్యధికంగా జలదంకి మండలంలో 177.6, విడవలూరులో 168.6 మి.మి. నమోదైంది. దాదాపు 38 మండలాల్లోనూ వర్షపాతం నమోదు కాగా.. 15 మండలాల్లో 100 మి.మి. కంటే ఎక్కువ కురిసింది. అత్యల్పంగా సీతారామపురం 40.4 మి.మి., రాపూరులో 54.6, సైదాపురంలో 58 మి.మి. నమోదైంది. కాగా మంగళవారం కూడా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

మండలం	వర్షపాతం (మి.మీ)
జలదంకి	177.6
విడవలూరు	168.6
అల్లూరు	153.6
కొడవలూరు	140.6
కావలి	138.8
బోగోలు	134.6
సంగం	126
కందుకూరు	124.2
బుచ్చి	116
కోవూరు	113.8
దగదర్తి	114.8
కలిగిరి	109.4
అనంతసాగరం	107.2
ముత్తుకూరు	102
నెల్లూరు అర్బన్	100.4



నెల్లూరు నగరంలో వర్షంలోనే వాహనదారుల రాకపోకలు



అనంతసాగరంలో ధాన్యం కాపాడుకునే యత్నంలో రైతులు



కలిగిరిలో నేలకూలిన చెట్టు



కావలి పాత శివాలయం వీధిలో అవస్థలు

యంత్రాంగం అప్రమత్తం

మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. జన జీవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు.. వేటకు వెళ్లిన 161 బోట్లలోని 650 మంది మత్స్యకారులను సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం 146 పునరావాస కేంద్రాలను పరిశీలించారు. సోమశిలకు వరద ప్రవాహం పెరిగితే ముంపునకు గురయ్యే 127 గ్రామాల్లోని ప్రజలను జాగృతం చేశారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వెంకటగిరిలో ఒకటి, నెల్లూరులో ఒకటి చొప్పున ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు.



మరో 48 గంటలు: ఒ.ఆనంద్, కలెక్టర్

రాబోయే 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు సూచించాం. మండల, గ్రామస్థాయి అధికారులు వారి హెడ్ క్వార్టర్స్‌లోనే ఉంటారు. కావలి, కొడవలూరు మండలాల్లో ఇప్పటికే పలువురిని పునరావాస కేంద్రాలకు తరలించాం. గాలులకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు పడిపోయే అవకాశం ఉండటంతో.. వెంటనే పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేశాం. నగరంలోని హోర్డింగ్‌లపైనా దృష్టిపెట్టాం.

లేదయ్యా లక్కు.. కొందరికే కిక్కు!



ఎలాగైనా మద్యం దుకాణం సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతో పదుల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నవారు కొందరైతే.. మరికొందరు అదృష్టాన్ని పరీక్షించుకుందామని పోటీపడ్డారు. ఒక్కో దుకాణానికి సగటున 21 మంది పోటీపడగా– సోమవారం ఆ ప్రక్రియ కాస్త ముగిసింది. కొన్ని రోజులుగా అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. లాటరీ విధానంలో కొందరినే అదృష్టం వరించగా.. మరికొందరు ఒక్కటీ రాక.. ఉసూరుమంటూ వెనుదిరిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున మహిళల పేరుతో దరాఖాస్తు చేయగా.. ఆ ప్రక్రియలో నేరుగా పాల్గొనేందుకు కొందరు కస్తూర్బా కళాక్షేత్రానికి రావడం గమనార్హం. వీరంతా ఈ నెల 16వ తేదీ నుంచి దుకాణాలు ప్రారంభించనున్నారు.

ప్రశాంతంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ

ఈనాడు, నెల్లూరు: నేరవార్తలు, న్యూస్‌టుడే

జిల్లాలో మొత్తం 182 మద్యం దుకాణాలకు 3,890 దరఖాస్తులు అందగా– సోమవారం లాటరీ ప్రక్రియ ద్వారా వాటిని కేటాయించారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ.. మధ్యాహ్నం 1.30 గంటలకు పూర్తయింది. ప్రతి దుకాణానికి సంబంధించి.. డ్రా తీసేటప్పుడు పేర్లు పిలవడంతో పాటు.. వచ్చిన నంబరును దరఖాస్తుదారులకు చూపించారు. దాన్ని వీడియో ద్వారా చిత్రీకరించారు. దుకాణాలు దక్కించుకున్న వారు.. వార్షిక లైసెన్సు ఫీజులో ఆరో వంతు చెల్లించి.. ప్రొవిజినల్ లైసెన్సులు పొందారు.

మహిళలకు 24...

ఈ సారి మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో.. మహిళల పేర్లు అధికంగా ఉన్నాయి. 182 దుకాణాల్లో.. 24 వారికే దక్కాయి. పలువురు నేరుగా దరఖాస్తు చేసుకోగా.. కొందరు భర్తలు సెంటిమెంట్‌గా భావించి.. ఇంట్లోని వారి పేరుతో దరఖాస్తు చేశారు. మొత్తంగా 150 దరఖాస్తులు మహిళల పేరుతో రాగా.. నెల్లూరు, నెల్లూరు గ్రామీణం, కావలి, ఆత్మకూరు, బుచ్చి, ఇందుకూరుపేట, కలిగిరి, కందుకూరు, పొదలకూరు, ఉదయగిరి ప్రాంతాల్లోని 1, 2, 12, 13, 16, 25, 26, 29, 45, 54, 55, 72, 82, 90, 92, 120, 123, 128, 141, 142, 147, 154, 176, 180 నంబర్ల దుకాణాలను మహిళలు సొంతం చేసుకున్నారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ ఆనంద్



కస్తూర్బా కళాక్షేత్రం వద్ద కోలాహలం

రూ. 193.50 కోట్ల ఆదాయం

జిల్లాలో రూ. 85లక్షల శ్లాబ్‌లో 38, రూ.65లక్షల్లో 48, రూ. 55లక్షల శ్లాబ్‌లో 98 మద్యం దుకాణాలు ఉండగా– 3,890 దరఖాస్తులు వచ్చాయి. ఈ రూపంలో ప్రభుత్వ ఖజానాకు రూ. 77.80 కోట్ల ఆదాయం రాగా, లైసెన్సు ఫీజుల ద్వారా రూ. 115.50 కోట్లు రావాల్సి ఉంది. వ్యాపారులు ఆరు విడతల్లో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారు.. వార్షిక లైసెన్సు ఫీజులో 1/6 వంతు చెల్లించారు. దీని ద్వారా రూ. 19.28కోట్ల ఆదాయం వచ్చింది.

ఎన్నో 'సిత్రాలు'...

- మంత్రి పొంగూరు నారాయణ పార్టీ కార్యకర్తల కోసం రూ. 2 కోట్ల సొంత నిధులతో 100 దరఖాస్తులు వేయగా.. మూడు దుకాణాలు దక్కాయి. వాటిని డివిజన్‌స్థాయిలో పార్టీ అధ్యక్షులకు అప్పగించారు. ఒక్కోదాన్ని అయిదుగురికి.. మొత్తం 15 మంది నిర్వహించుకోవాలని సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
- ఉలవపాడు మండలంలో అయిదుగురు సిండికేట్‌గా ఏర్పడి.. సుమారు 24 దరఖాస్తులు వేశారు. వీటిలో గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో నాలుగు దక్కాయి.
- అల్లూరు నగర పంచాయతీ పరిధిలో నాలుగు, రూరల్‌లో రెండింటికి టెండర్లు పిలవగా.. అధికార పార్టీకి చెందిన ఓ గ్రామస్థాయి నాయకుడు పలువురితో కలిపి బృందంగా ఏర్పడి 15 దరఖాస్తులు వేయగా.. ఒక్కటీ రాలేదు.
- ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 13కు ప్రక్రియ నిర్వహించగా.. 321 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ముగ్గురు మహిళలకు దుకాణాలు దక్కాయి.
- కందుకూరు పట్టణంలో నాలుగు ఉండగా.. 20 మంది సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేశారు. రెండు దుకాణాలు వచ్చాయి. ఆ ప్రకారం ఒక్కో వ్యక్తికి దుకాణంలో 5 పైసల వాటా దక్కడంతో.. అయోమయంలో ఉన్నారు.
- లింగసముద్రం మండలంలో రెండు దుకాణాలు ఉండగా.. ఒక్కో దానికి 34 దరఖాస్తులు రాగా.. ఒకే దరఖాస్తు వేసిన మహిళకు దక్కడం గమనార్హం.
- నెల్లూరు నగరంలో ఇటీవల పదవి పొందిన ఓ నాయకుడు.. సుమారు 27 మందితో సిండికేట్‌గా ఏర్పడి 150 దరఖాస్తులు వేశారు. సుమారు రూ. 3 కోట్లు ఖర్చు చేశారు. వారిలో ఒక్కరికీ లక్కీడిప్‌లో దుకాణం రాలేదు.

చేనేతకు ఊరట!



నూలు కొనుగోలుపై 15శాతం రాయితీ

నేతన్నలకు ఊరట కలిగేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాయితీపై నూలు సరఫరా, ఇ–కామర్స్ ద్వారా ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఆ దిశగా విధి విధానాలను సైతం విడుదల చేసింది.

న్యూస్‌టుడే, నెల్లూరు(వ్యవసాయం)

బేలులో వంద బార్ల నూలు ఉండగా– దాంతో 500 చీరలు నేయొచ్చు. బేలు ధర రూ. 50,300 వరకు ఉంటుంది. ఒక బారుతో అయిదు చీరలు నేసేందుకు నేతన్న కుటుంబానికి వారం రోజులు పడుతుంది. వచ్చే కూలీ మాత్రం రూ.2వేలే. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. చేనేత కార్మికులకు ముడి పదార్థాల సరఫరా పథకం కింద 15 శాతం రాయితీపై నూలు సరఫరా చేయాలని నిర్ణయించింది. విధి విధానాలను సైతం విడుదల చేసింది. చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, మాస్టర్ వీవర్లు ఈ పథకానికి అర్హులు. రాయితీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డీబీటీ ద్వారా విడుదల చేస్తారు.

'జిల్లాలో సుమారు పది వేలకుపైగా చేనేత కుటుంబాలు ఉండగా– నెల్లూరు నగరం, కోవూరు, పాటూరు, నారాయణరెడ్డిపేట, బుచ్చి, సంగం, వింజమూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది నివాసం ఉంటున్నారు. వీరిలో సొంత మగ్గం ఉన్నవారు 5,100 మంది వరకు ఉండగా– వారికి అనుబంధంగా 8 ఉపవృత్తుల పనులు చేసేవారు మరో అయిదు వేల కుటుంబాలు ఉన్నాయి. పెరిగిన ముడి సరకుల ధరలు, సరైన మార్కెటింగ్ వసతులు, ప్రచారం లేని కారణంగా.. నేతన్నలు నష్టపోతున్నారు.'

'ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా నేత కార్మికులు తమ ఉత్పత్తులను టోకు, చిల్లర వ్యాపారులకు, వ్యక్తిగత వినియోగదారులకు విక్రయించి.. వ్యాపారం అభివృద్ధి చేసుకోవడంతో పాటు లాభాలు ఆర్జించేందుకు, మధ్యవర్తిత్వాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. ఓఎన్‌డీసీలో అమ్మకందారులుగా సభ్యత్వ నమోదుకు.. వ్యాపారం పేరు, చిహ్నం, సంస్థ పేరు రిజిస్టరైన పాన్, జీఎస్టీ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ నంబరు, కేవైసీ నిరూపణకు శాశ్వత చిరునామా వివరాలు అందించాలని తెలిపింది. https://seller.mystore.in/en/sellerregister అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది.'

పేర్లు నమోదు చేసుకోవాలి

– పి.వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి

ప్రభుత్వం చేనేత కార్మికులకు ముడి పదార్థాల సరఫరా పథకం ద్వారా 15 శాతం రాయితీపై నూలు సరఫరా చేయనుంది. ప్రతి నేతన్న ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్‌లో అమ్మకందారులుగా సభ్యత్వ నమోదు చేయించుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

26న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు పాలకవర్గంలో ప్రధానమైన జడ్పీ ఏడు సాయీ సంఘాల సమావేశాలను ఈనెల 26న నిర్వహించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌ఛార్జి సీఈవో మోహన్‌రావు నిర్ణయించారు. సమావేశాలకు జడ్పీ సభ్యులతోపాటు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. ఇందుకు వారికి సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.

రైతేరాజు | కరవు సీమలో పామాయిల్ సాగు | 6లో..

వేడుకగా పల్లె పండగ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పల్లెలు ప్రగతి పట్టా లెక్కుతున్నాయి. అందులో భాగంగా సోమవారం జిల్లాలో పల్లెపండగ కార్యక్రమం ప్రారంభమైంది. నెల్లూరు గ్రామీణ మండలంలోని దొంతాలి, ఆమంచర్లలో సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభించారు. ఉదయగిరి పరిధిలో స్థానికంగా రెండు పనులు, కందుకూరులో మరో రెండు పనులు ఇలా.. జిల్లావ్యాప్తంగా ఆరు పంచాయతీల్లో 27 పనులు తొలిరోజు మొదలయ్యాయి. దాదాపు రూ.2.23 కోట్ల విలువగల సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు ప్రారంభించారు. ఉదయగిరిలో 15 పనులు, కందుకూరులో పది, నెల్లూరు గ్రామీణంలో రెండు పనులు ఉన్నాయి. అలాగే మినీ గోకులాలు (పశువుల కొట్టాలు) కింద 13.8 లక్షలతో మరో ఆరు పనులు అధికారులు, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ రెండు పంచాయతీల వంతున పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షం వల్ల కోవూరు, కావలి, సర్వేపల్లి, ఆత్మకూరులో పనుల ప్రారంభానికి ఆటంకం కలిగింది. వర్షం తగ్గగానే ప్రారంభిస్తామని డ్వామా ఏపీడీ లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ తెలిపారు.



చాగొల్లులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కరెంట్ తీగ.. కాటేస్తుంది జాగ్రత్త!

ఈనాడు, నెల్లూరు

వర్షాలతో పాటే విద్యుత్తు ప్రమాదాలు పొంచి ఉంటాయి. కొద్దిపాటి నిర్లక్ష్యం.. ఏమరపాటుతో ఏటా ప్రాణాలు పోగొట్టుకుంటున్నవారు ఎందరో? బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో అన్ని ప్రాంతాలు తడిగా మారాయి. రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యం.. ఈదురు గాలులు, విద్యుత్తు తీగలు తెగిపోవడం, బోరు మోటరుకు తగిలే పరిస్థితులు నెలకొంటాయి. ఈ పరిస్థితుల్లో ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు, పొలాలు.. ఇలా అంతటా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. సమస్య ఉంటే.. వెంటనే విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సొంత ప్రయత్నాలు చేస్తే ప్రమాదం కొని తెచ్చుకున్నట్లేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నుంచి రక్షణ




ఇంట్లో..



● తడి చేతులతో విద్యుత్తు బోర్డులో స్విచ్‌లు వేయరాదు. ● విద్యుత్తు తీగలకు అతుకులు ఉంటే.. ఎలక్ట్రీషియన్‌తో వెంటనే మార్పించుకోవాలి. ● దుస్తులు ఆరేసుకునే తీగకు.. కరెంట్ తీగ తగలకుండా చూసుకోవాలి. ● అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి నీరు చేరి విద్యుత్తు తీగలకు తగిలినా.. మీటర్ల వరకు చేరుతున్నా.. విద్యుత్తు సిబ్బందికి సమాచారమివ్వాలి.

రోడ్లపై..



● రహదారి వెంట ఉన్న విద్యుత్తు స్తంభాలు, సపోర్టు తీగలను ఎట్టి పరిస్థితుల్లో తాకొద్దు. ● నియంత్రికల వద్ద శబ్దం వస్తే.. వెంటనే విద్యుత్తుశాఖ అధికారులకు తెలపాలి. ● రోడ్డుపైన, నీటిలో విద్యుత్తు తీగపడి ఉంటే.. తాకొద్దు.. దాని మీదుగా వాహనాలు నడపొద్దు.. తీగలు తెగిపడితే.. సమీప సిబ్బందికో, కంట్రోల్ రూమ్ నంబర్లకో ఫోన్ చేయాలి. ● నియంత్రికల వద్ద అనధికారికంగా ఫ్యూజ్‌లు మార్చడం.. మరమ్మతులు చేపట్టడం తదితరాలు చేయొద్దు.

పొలాల్లో..

● వర్షం పడుతున్న సమయంలో వ్యవసాయ మోటార్లు ఆన్ చేయరాదు. ● స్టే వైర్, విద్యుత్తు తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిల్చోరాదు. వాటికి దూరంగా ఉంచాలి. ● వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలి. ● నియంత్రికల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు చేపట్టడం ప్రమాదకరం.

ఫిర్యాదు చేయాలంటే...

టోల్‌ఫ్రీ నంబరు: 1912, 1800 425 155333

వాట్సాప్ నంబరు: 91333 31912

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

డివిజన్	ఫోన్ నంబరు
నెల్లూరు టౌన్	76016 42857
కోవూరు	97052 00708
కావలి	79010 56437
ఆత్మకూరు	79010 56906
విద్యుత్తు భవన్	94408 17468



ముందస్తు చర్యలు: కె.ఆదిశేషయ్య, జిల్లా నోడల్ అధికారి, విద్యుత్తుశాఖ

తుపాను నేపథ్యంలో విద్యుత్తుశాఖ అప్రమత్తంగా ఉంది. అన్ని డివిజన్లలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా విద్యుత్తు సమస్య ఉంటే.. వెంటనే అధికారులను సంప్రదించాలి. ఇనుప స్తంభాలను తాకొద్దు.. తెగిపడిన తీగల జోలికి వెళ్లొద్దు.

కండలేరులో కబ్జాలు.. అడ్డుకునేదెవరు?

కండలేరు జలాశయం కబ్జాదారులకు అడ్డాగా మారింది. రైతుల నుంచి జలాశయం కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి తోటలు, పంట పొలాలుగా మార్చుకుంటున్నారు. ఆ భూములు ముంపునకు గురికాకుండా ఉండేలా చుట్టూ రెండు మీటర్ల ఎత్తు వరకు కట్టలు వేశారు. ఆపై సొంత భూముల్లా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు.

చేజర్ల, న్యూస్‌టుడే: కండలేరు జలాశయం నిర్మాణం కోసం చేజర్ల, కలువాయి, రాపూరు, పొదలకూరు మండలాల్లోని 21 గ్రామాల్లో సుమారు 25 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మొత్తం విస్తీర్ణం 37,750 ఎకరాలు కాగా +39 నుంచి +89 కాంటూరు మధ్య జలాశయం ఉంది. గరిష్ఠ నీటి నిలువ సామర్థ్యం 68 టీఎంసీలు. సోమశిల జలాశయం నుంచి 65 టీఎంసీలు వరదకాలువ ద్వారా తరలించి కండలేరును నింపారు. డ్యాంలో నీటిని పూర్తి స్థాయిలో నింపితేనే 85 మీటర్ల కాంటూరుకు నీరు చేరుతోంది. సగం నీరున్నప్పుడు 75 మీటర్లకు దిగువన ఉంటుంది. దీంతో ఇదే అదనుగా భావించి కబ్జాదారులు కండలేరును ఆక్రమం చేస్తున్నారు.



జలాశయంలో సాగులో ఉన్న భూములు

ఎత్తుపెంచి మరీ..

గతంలో జలాశయం లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన పైర్లు నీటి మట్టం పెరగడంతో మునిగిపోయాయి. ఈసారి అలా జరగకుండా అడ్డుకట్టలు, కాంటూరు కన్నా భూములను ఎత్తు పెంచటం చేస్తున్నారు. ఈ భూముల్లో పంటల సాగుతో పాటు ఆక్వా ఫార్మింగ్ యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక జలవనరుల శాఖ పర్యవేక్షణ లేని కారణంగా వీరిని అడ్డుకునే వారు లేకుండా పోయారు. భూములు కోల్పోయిన పేదలు ఎక్కువ మంది పశువులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కట్టలు వేయడంతో పశువుల మేతకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

సాకుగా చూపి..

గతంలో ఉన్న కొంత భూమిని సాకుగా చూపి ఆక్రమణదారులు భారీగా ఆక్రమించేశారు. సుమారు 1000 ఎకరాలు ఆక్రమణదారుల చెరలో ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఈ వ్యవహారంపై నెర్నూరు గ్రామానికి చెందిన కొందరు స్థానిక తహసీల్దారు కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. జలవనరులశాఖకు చెందిన భూమిపై తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని స్థానిక అధికారులు చెబుతున్నారు.

అడ్డొస్తే ఫిర్యాదు చేయండి

రమణారెడ్డి, పర్యవేక్షక ఇంజినీరు, తెలుగుగంగ

కండలేరు కోసం సేకరించిన భూమి అంతా ప్రభుత్వానిది. ఇందులో పైర్లు సాగు చేయటం, కట్టలు వేయటం చట్ట విరుద్ధం. ఎవరూ ఆక్రమించిన చర్యలు తప్పవు. మేత, నీటి కోసం వచ్చే పశువులు, జీవాల కాపరులను ఎవరైనా అడ్డుకొంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి. నీటి నిల్వకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటాం.

మధుర ఫలం.. సిరుల పథం



కావలి, న్యూస్‌టుడే: మామిడి తోటపై క్రమం తప్పకుండా లాభాలు గడిస్తున్నారు కావలి మండలంలోని రుద్రకోట గ్రామానికి చెందిన దన్నూరి దాసు. ఆయన తనకున్న 1.5 ఎకరాల్లో రెండు రకాల మామిడి పండిస్తున్నారు. పునాస రకం అర ఎకరా, బంగినపల్లి మిగిలిన ఎకరాలో వేశారు. అధికారుల సూచనలు పాటిస్తూ ఏటా రూ.65 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. పునాసలో అంతర పంటగా దొండ, తోటకూర, గోంగూర వంటివి పండిస్తూ ఇంటి అవసరాలతో పాటు మరో రూ.10 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఆరున్నర సంవత్సరాల క్రితం మామిడి మొక్కలు నాటారు. నాలుగేళ్లుగా పునాస, మూడు సంవత్సరాలుగా బంగినపల్లి రకం కాయలు దిగుబడి వస్తున్నాయి. ఏప్రిల్ నుంచి పూత ప్రారంభమై, జులై నెల వరకు కాపు వస్తుందని దాసు తెలిపారు. ఏటా ఎరువు, కూలీలు, సేద్యం, మందులు తదితర వాటికి రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కాయలపై రూ.90 వేల వరకు రాబడి వస్తుందని, ఖర్చులు పోను రూ.65 వేలకు పైగా మిగులుతున్నాయని ఆయన వివరిస్తున్నారు.

కర్బన పదార్థం అధిక దిగుబడులకు మార్గం

అల్లూరు, న్యూస్‌టుడే : భూమిలో కర్బన పదార్థం పెంపుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండలంలోని నార్తుమోపూరుకు చెందిన చెంచయ్య అనుభవపూర్వకంగా నిరూపించారు. ఎకరాకు అధికంగా ఐదు బస్తాలు సాధించినట్లు చెబుతున్నారు. రసాయన ఎరువుల కారణంగా భూమిలో దిగుబడి తగ్గిపోతోంది. దీనిపై వ్యవసాయ అధికారులను సంప్రదించగా భూమికి సహజ సిద్ధమైన ఎరువు అవసరమని సూచించారు. దీంతో పచ్చిరొట్ట ఎరువు పైరులైన జీలుగ, జనుము సాగు చేపట్టారు. పూత దశలో కలియదున్నారు. భూమికి కర్బన పదార్థం సమకూరింది. వరుసగా అయిదేళ్లుగా వేస్తున్నారు. రెండో సంవత్సరంలో వరి దిగుబడిలో పెరుగుదల కనిపించింది. గత ఏడాది జీలకర సన్నాలు రకాన్ని పదెకరాల్లో వేశారు. ఎకరాకు అదనంగా ఐదు బస్తాలు పండాయి. బస్తా రూ. 1150 చొప్పున, రూ. 5750 ఎకరాకు అదనంగా వచ్చింది. పదెకరాలకు రూ. 57,500 అదనపు ఆదాయం లభించింది.



కరవు సీమలో పామాయిల్ సాగు



వింజమూరులో పామాయిల్ తోట

న్యూస్‌టుడే, వింజమూరు

జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కరవుతో రైతులు పంటల సాగులో ఏటా నష్టపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. పలు ప్రాంతాల్లో రైతులు పామాయిల్ తోటలు వేస్తున్నారు. దీంతో విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం కూడా సహకారమిస్తోంది. రాయితీపై మొక్కలు, డ్రిప్, రసాయన ఎరువులు అందిస్తోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 400 మంది రైతులు 2500 ఎకరాల్లో వేశారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో వింజమూరులో ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 800 ఎకరాల్లో మొక్కలు వేయగా మరో 500 ఎకరాల్లో నాటేందుకు సమాయత్తం అవుతున్నారు. నాలుగో ఏడాది నుంచి గెలలు కోతకు వస్తున్నాయి. 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తోంది. చెట్లు పెద్దవయ్యే కొద్దీ దిగుబడి పెరుగుతోంది. తోట సక్రమంగా పెరిగితే ఏటా ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వం రాయితీ

ప్రభుత్వం రూ.193ల విలువైన మొక్క ఉచితంగా అందిస్తోంది. తొలుత రైతు చెల్లిస్తే ఈ మొత్తాన్ని తరువాత ఇస్తారు. అయిదెకరాల లోపు రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇస్తోంది. హెక్టారుకు రూ. 5,250 వంతున నాలుగేళ్లపాటు ఆర్థిక సహాయం వస్తోంది. కరోనా సమయంలో టన్నుకు రూ. 25 వేలకు పైగా ఉండగా ప్రస్తుతం రూ. 14 వేలు మాత్రమే ఉంది.

భయం లేని పంట

కరకల నాగిరెడ్డి, కొత్తూరు, వింజమూరు

విడతల వారీగా 40 ఎకరాల్లో పామాయిల్ సాగు చేశా. దొంగల భయం లేదు. మార్కెటింగ్ బెంగ లేదు. చీడపీడల సమస్యా లేదు. ఆదాయం బాగానే ఉంది. నీటి వసతిపై ఆందోళన ఉంది. చెరువులకు నీరు నింపితే భూగర్భ జలం పెరిగి బోర్లలో నీరందుతోంది. తోటలు ఇంకా పెద్ద సంఖ్యలో సాగు చేస్తారు.



సమస్యలు-సమాధానాలు

సమస్య : జీలుగను నీళ్లు లేకుండా భూమిలో కలియదున్నవచ్చా ?

–రామయ్య, అల్లూరు

జవాబు : నీటిలో కలియదున్నితే మంచి ఫలితాలు వస్తాయి

సమస్య : జీలుగకు పురుగులు ఆశించి ఆకులను తినేస్తున్నాయి ?

– వెంకటేశ్వర్లు, అల్లూరుపేట

జవాబు : పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉంటే క్లోరిఫైరిఫాస్ మందు పిచికారీ చేసుకోవచ్చు

సమస్య : రాయితీపై జింక్ సల్ఫేటు అందుబాటులో ఉందా ?

–నాగరాజు, నార్తుమోపూరు

జవాబు : ప్రస్తుతం లేదు. ప్రభుత్వం నుంచి నిల్వలు రాగానే సమాచారం ఇస్తాం.

(రైతుల సందేహాలకు వ్యవసాయాధికారిణి లలిత సమాధానాలు ఇచ్చారు.)

–న్యూస్‌టుడే, అల్లూరు

మిశ్రమ పంట లాభాలంట

చేజర్ల, న్యూస్‌టుడే : పండ్ల తోటల సాగులో మెట్ట ప్రాంత రైతులు మిశ్రమ సాగుతో లాభాలు పండిస్తున్నారు. జామ, మామిడి, బత్తాయి, నిమ్మ తోటల్లో ఈవిధానాన్ని పాటిస్తున్నారు. చవటపల్లికి చెందిన సురేష్ తన వ్యవసాయ క్షేత్రంలో మామిడి, జామ మిశ్రమ విధానంలో సాగు చేస్తున్నారు. వేసవిలో మామిడి పంట వస్తోండగా, ఏడాదిలో మూడు సీజన్లలో జామ కాపు కొస్తోంది. జామ నాటిన రెండో ఏడాది నుంచి ఫల సాయం వస్తోండగా మామిడి అయిదో సంవత్సరం నుంచి దిగుబడి వస్తోంది. ఒకే భూమిలో రెండు రకాల సాగుతో ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం సాధిస్తున్నారు. పదెకరాల విస్తీర్ణంలో మిశ్రమ సాగు చేయగా జామపై ఎకరానికి రూ. 40 వేల వంతున మిగులుతోంది. మామిడి గిరాకీని బట్టి ఎకరానికి రూ. 40 వేల నుంచి రూ. 70 వేల వరకు రాబడి వస్తోంది. ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు పునాస మామిడి కాపునిస్తూ రైతులకు లాభదాయకంగా మారింది.



జామ తోట

సాగు చేస్తున్నారిలా.. మొక్కలకు నీటి సరఫరా కోసం బిందు సేద్యం పరికరాలు అమర్చారు. కలుపు మొక్కలు పెరగకుండా మినీ ట్రాక్టరు సాయంతో ఏడాదికి నాలుగుసార్లు అంతర సేద్యం చేస్తున్నారు. వర్షాకాలానికి ముందు కంపోస్టు ఎరువులు వేసి కలియ దున్నుతున్నారు. కాయలు ఎదుగుదల కోసం బిందు సేద్యం విధానంలో నీటిలో కరిగే ఎరువులు వేస్తున్నారు.

పర్యవేక్షణతో మంచి ఫలితాలు: సురేష్

రెండు, మూడు రకాలు కలిపి సాగు చేయడం లాభదాయకంగా ఉంది. నిరంతర ఆదాయ మార్గంగా ఉంటోంది. తోటలపై నిత్యం పర్యవేక్షణతో మంచి ఫలితాలు వస్తాయి.

మెరుగైన వైద్య సేవలు అందించాం

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుడైన వ్యక్తి మృతి చెందాడని తమ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదని జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధా నాయక్ స్పష్టం చేశారు. బతికుంటే చనిపోయాడని రోగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంపై ఆయన సోమవారం తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 10న సాయంత్రం నార్తు రాజుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అపస్మారక స్థితిలో ఉన్న రఫీని 108 ద్వారా జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారన్నారు. బంధువులు ఎవరూ లేకపోయినా వైద్యులు సేవలు అందించగా కోలుకున్నాడని తెలిపారు. రోగి మృతి చెందాడంటూ వచ్చిన వార్తలపై విచారణ జరిపానని వివరించారు. కేసు షీటులో సైతం రోగి మృతి చెందాడని రాయలేదన్నారు. మృతి చెందాడని రోగి భార్యకు ఎవరు చెప్పారని విలేకరులు ప్రశ్నించగా, పోలీసులే చెప్పారనే విషయం విచారణలో వచ్చిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.

వర్షంలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా వ్యాప్తంగా 30 ఫిర్యాదులు

నెల్లూరు(నేర విభాగం): వర్షంలోనూ సోమవారం పోలీసుశాఖ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించింది. స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య ఫిర్యాదులు స్వీకరించారు. 30 ఫిర్యాదులు రాగా వాటిని పోలీసు స్టేషన్ల వారీగా అందజేశారు. శ్రీహరి అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని రాపూరుకు చెందిన యువతి.. కోవూరుకు చెందిన రవిశంకర్, రవి బాలాజీ ఆర్థిక లావాదేవీల విషయంలో బెదిరిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. తన భర్త వారం రోజుల నుంచి కనిపించడం లేదనీ బాలాజీ నగర్‌కు చెందిన మహిళ.. భర్త, అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వేదాయపాలెంకు చెందిన మహిళ వినతులు ఇచ్చారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, న్యాయ సలహాదారు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసులు



భూగర్భ వంతెనలో నీరు.. రాకపోకలకు అవస్థలు

తీర ప్రాంత మండలాలకు వెళ్లే రాజుపాలెం రోడ్డులో టపాతోపు వద్ద ఉన్న భూగర్భ రైల్వే వంతెన సోమవారం వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నిర్మాణ సమయంలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడింది. – న్యూస్‌టుడే, అల్లూరు

కండక్టర్ నిజాయతీ

కావలి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో దొరికిన రూ.లక్ష విలువైన ఆభరణాలు, రూ. 4వేల నగదు ఉన్న పర్సును వదిలేసి వెళ్లిన మహిళకు దాన్ని అందజేసి కండక్టర్ తన నిజాయతీ చాటుకున్నారు. అల్లూరు బస్సులో ఆదివారం శ్రీహరికోట కుమారి తన పర్సును మర్చిపోయి వెళ్లారు. సీట్లో ఉన్న దీన్ని గమనించిన కండక్టర్ ఎన్.వెంకయ్య తీసుకుని సమాచారాన్ని డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసులుకు తెలిపారు. సోమవారం బాధిత ప్రయాణికురాలు వచ్చి పర్సులో ఉన్న ఆభరణాల వివరాలు సరిగ్గా చెప్పడంతో ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ ఆమెకు అందజేశారు. ఆర్టీసీ అధికారులు, స్థానికులు కండక్టర్‌ని అభినందించారు.



ప్రయాణికురాలికి పర్సు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నెల్లూరు(విద్య): జిల్లాలో డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత బోధన, భోజన, వసతి కల్పించనున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ సాధికారత అధికారి బి.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన స్టడీ సర్కిళ్లు, ఇతర శిక్షణ కేంద్రాల్లో మూడు నెలల పాటు అభ్యర్థులు శిక్షణ పొందేందుకు ఈనెల 21 వరకు అవకాశం కల్పించినట్లు వివరించారు.

16న ఉద్యోగమేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా 16న నగరంలోని మైపాడు గేటు రోడ్డు పాత చెక్‌పోస్టు ప్రాంతం వద్ద నాక్, కావలి వైకుంఠపురం వీఎస్‌యూ కళాశాలలో ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎం.వినయ్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి అబ్దుల్ ఖయ్యూం ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతినుంచి డిగ్రీ, ఎంబీఏ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటోను ఢీకొన్న టిప్పరు

పోతిరెడ్డిపాళెం(కోవూరు), న్యూస్‌టుడే: ఆటోను టిప్పరు ఢీకొనడంతో ఆటో డ్రైవరుకు గాయాలైన సంఘటన పోతిరెడ్డిపాళెం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపాళేనికి చెందిన ఆటో డ్రైవరు మణి నెల్లూరుకు వెళ్తుండగా చక్కెర కర్మాగారం వద్ద వేగంగా వచ్చిన టిప్పరు ఢీకొంది. ఆటో డ్రైవరుతోపాటు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.



పెళ్లికి వెళ్లొస్తుండగా ప్రమాదం

ఇద్దరు మహిళల మృతి

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: బంధువుల వివాహ కార్యక్రమానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోకూరుకు చెందిన పలువురు నలదలపూరు ఎస్సీకాలనీలో ఆదివారం రాత్రి జరిగిన లింగాబత్తిన సులోచన మనవరాలు వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వధూవరులను వారు ఆశీర్వదించారు. వేకువజామున సుమారు 3 గంటల తర్వాత కారులో పోకూరుకు వారు బయలుదేరారు. సమీపంలోని మలుపు వద్ద కారు అదుపు తప్పి దిగువ పొలం గట్టుకు ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో వెనుక సీటులో ఉన్న లింగాబత్తిన సులోచన(53), కాలె సామ్రాజ్యం (65) ముందు సీటుకు బలంగా ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. డ్రైవరు పులి సుకుమార్ కాలుకు తీవ్ర గాయమైంది. పర్రె కొండమ్మ, తుమ్మ అమరావతి, ప్రియదర్శిని, ఉదయశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం పలువురిని బంగోలుకు తరలించారని చెప్పారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు ప్రాంతీయ వైద్యశాలలోని క్షతగాత్రులను పరామర్శించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మరిదినాయుడు తెలిపారు.

మెట్ల కింద పసికందు మృతదేహం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: రోజులు నిండని చిన్నారి మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి మెట్ల కింద పడేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి రామ్‌నగర్‌లో కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు.. రామ్ నగర్ మూడో వీధిలోని ఓ విశ్రాంత పోలీసు అధికారి ఇంట్లో హుమేరా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె రామ్ నగర్‌కు సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. అక్కడే ఒడిశాకు చెందిన తానుజాక్షతో పరిచయమైంది. ఆమె గర్భవతి కావడంతో హుమేరా వద్దనే ఉంటోంది. ఆమె రెండు రోజుల క్రితం ఊరెళ్లింది. తానుజాక్షి పాపకు జన్మనిచ్చింది. పాప పురిట్లోనే చనిపోయిందో.. ఎం జరిగిందో తెలియదుగానీ వస్త్రంలో చుట్టి మెట్ల కింద పడేసి వెళ్లిపోయింది. ఊరెళ్లిన హుమేరా సోమవారం తిరిగి వచ్చింది. రాత్రి మెట్ల కింద దుర్గంధం వస్తుండటంతో గుర్తించి 112కు కాల్ చేసింది. సంఘటనా స్థలాన్ని దర్గామిట్ట ఎస్సై రమేష్ బాబు పరిశీలించారు. పసికందు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల బదిలీలకు ఛైర్‌పర్సన్ ఆమోదం తెలిపారు

హైకోర్టుకు నివేదించిన నెల్లూరు జడ్పీ సీఈవో

విచారణ ఈనెల 19కి వాయిదా

ఈనాడు, అమరావతి: నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీకి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆమోదం తెలిపారని, ఆమెను సంప్రదించిన తర్వాతే బదిలీలు చేశామని జడ్పీ సీఈవో తరపు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. ఆమోదం కోసం పంపిన ఫైల్‌పై ఆమె సంతకం చేశారన్నారు. సంబంధిత నోట్ ఫైల్ తదితర వివరాలను కోర్టుకు అందజేశారు. ఈ వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. పిటిషనర్ సంతకం చేసినట్లుందని వ్యాఖ్యానించారు. పిటిషనర్‌కు ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. దీంతో అరుణమ్మ తరపు న్యాయవాది పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం కావాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి.. వ్యాజ్యంపై విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు. కోర్టుకు ఇచ్చిన వివరాలను పిటిషనర్ తరపు న్యాయవాదికి ఇవ్వాలని సీఈవో తరపు న్యాయవాది అపర్ణలక్ష్మికి సూచించారు. ఉద్యోగుల బదిలీ విషయంలో తనను సంప్రదించకుండా ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఉత్తర్వులు జారీచేశారని పేర్కొంటూ నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దాఖలు చేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,334
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,672
వెండి గ్రాము :	రూ. 96.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	259
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	145
లేయర్	120
బ్రాయిలర్స్	258
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	284
లేయర్ మాంసం	204

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

మర్రిపాడు, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై మర్రిపాడు పోలీసులు సోమవారం రేప్ కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి, ఉదయగిరి మండలం కుర్రపల్లికి చెందిన యువకుడు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యారు. యువతి పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చిన ప్రతిసారీ మాట దాటేస్తూ వచ్చాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడంతో నిరాకరించాడు. దాంతో సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను వైద్య పరీక్ష నిమిత్తం ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. యువకుడిపై రేప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సోమశిల వద్ద అప్రమత్తం



ఆత్మకూరు,అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం వద్ద అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను నేపథ్యంలో జలాశయంలోకి వచ్చే నీటిని ప్రతి గంటకు లెక్కిస్తున్నారు. సోమవారం ఉదయం 6గంటలకు 51.997టీఎంసీల నిల్వ ఉంది. 7682క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మధ్యాహ్నం 12గంటలకు ఇన్‌ఫ్లో 6900క్యూసెక్కులుండగా సాయంత్రం 6గంటలకు 7500క్యూసెక్కులకు చేరింది. ప్రస్తుతం 52 టీఎంసీల నీరు ఉంది. వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఉత్తర, దక్షిణ కాలువలు, పెన్నార్‌డెల్టాకు నీటివిడుదల ఆపేశారు. కండలేరు వరదకాలువకు నీటి విడుదలను 6000క్యూసెక్కులకు తగ్గించారు. ఆదినిమ్మాయపల్లి ప్రాంతంలోని పెన్నానదిలో 8000క్యూసెక్కుల ప్రవాహం ఉంది. జలాశయంలోకి వచ్చే ప్రవాహాన్ని కడప జిల్లాలోని ప్రవాహ లెక్కింపు కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. అందుకనుగుణంగా అత్యవసర చర్యలు చేపట్టేందుకు జలాశయం వద్ద అధికారులను సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు ఎగువ ప్రాంతంలో ఆందోళన కలిగించే వరదలేదు.

ఆందోళన అవసరం లేదు.. బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి, ఈఈ

జలాశయంవద్ద అప్రమత్తంగా ఉన్నాం. వరద ప్రవాహానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.. అధిక స్థాయిలో వరద వస్తే.. క్రమబద్ధంగా విడుదల చేస్తాం. ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదు.

ముున్సిపాలిటీలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: తుపాను కారణంగా మున్సిపాలిటీలో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టేందుకుగానూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కె.అనూష తెలిపారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తక్షణ సాయం అవసరమైన వారు కంట్రోల్ రూమ్ 9177700267 నంబరుకు తెలియజేయాలని కోరారు.

సమష్టిగా పనిచేద్దాం

బిట్రగుంట, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో సమష్టిగా పనిచేయాలని బోగోలు తహసీల్దారు సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై భోజ్యానాయక్ ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి గోవిందరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించారు.

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

రెయిన్‌గేజ్ స్థలం మార్పు

సీతారామపురం, న్యూస్‌టుడే : మండలంలోని పబ్బులేటిపల్లిలో రెయిన్‌గేజ్‌ను సురక్షిత ప్రాంతానికి అధికారులు మార్చారు. జాతీయరహదారి విస్తరణ భద్రత కొరవడిన విషయమై ఈనెల 8వ తేదీన 'రెయిన్‌గేజ్ ఇలా.. భద్రత ఎలా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విషయాన్ని ఇన్‌ఛార్జి ఏఎస్‌వో కుమార్‌రాజా విషయాన్ని జిల్లా ముఖ్యప్రణాళికాధికారి ఏ.ఎస్.రాజు దృష్టికి తీసుకెళ్లగా స్థానిక రైతుసేవా కేంద్రం సమీపంలోకి మార్చారు.

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : పాతూరు శివాలయంలో వైకాపా నాయకుల పెత్తనం చేస్తున్నారు. దేవుడి నగల లెక్కలపై అనుమానాలున్నాయి. **- పాలూరు వెంకటేశ్వర్లు, పాతూరు**

సమాధానం : ఎవరి పెత్తనం లేదు. నగలు ఆలయ ధర్మకర్త ఆధీనంలోనే ఉన్నాయి. **-శశి కుమార్, ప్రధానార్చకులు, శివాలయం - కావలి, న్యూస్‌టుడే**

? పట్టణంలోని గాయత్రినగర్‌లో కాలువ నిర్మించేందుకు మట్టి తవ్వి వదిలేశారు. ప్రస్తుతం వర్షానికి ఇళ్లలోకి పోయేందుకు ఇబ్బందిగా ఉంటోంది. **- కె.ప్రసాద్**

✓ వర్షాలు తగ్గాక కాలువ నిర్మిస్తాం. ఆ తర్వాత చదును చేస్తాం **- కె.అనూష, మున్సిపల్ కమిషనర్,**

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం,

కందుకూరు జలమయం




ఆదిఆంధ్రకాలనీ సమీపంలో పొంగి పొర్లుతున్న వాగు.. కందుకూరుగ్రామీణం: పొలాల్లో..

కందుకూరు పట్టణం : పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, తహసీల్దారు ఇక్బాల్ పర్యటించి ప్రజల్ని అప్రమత్తం చేశారు. గుర్రంవారిపాలెం, వెంకటనారాయణబజారు, గాయత్రినగర్, ఉప్పుచెరువు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీళ్లు నిలవడంతో కచ్చా కాలువలు తీయించారు. తపాలా కూడలి, అంబేడ్కర్ విగ్రహ కూడలి, మున్సిపల్‌పార్కుకు వెళ్లే కూడలిలో రోడ్డుపై నీళ్లు నిలిచాయి. సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు కందుకూరు 64 మి.మీ. వర్షపాతం నమోదైంది. **కందుకూరు గ్రామీణం :** మండలంలో ఎడతెరపిలేని వర్షం కురిసింది. మాచవరంలోని ఎస్సీ కాలనీలో వర్షపునీరు నిలవటంతో పంచాయతీ అధికారులు పొక్లెయిన్ సాయంతో కాలువలు తీసి తొలగించారు. దొండపాడులో రహదారిపై నీరు నిలిచింది.

గుడ్లూరు : మండలంలో సుమారు 25.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుడ్లూరు ప్రధానవీధిలో మురుగుకాల్వలు పొంగి నీరు సిమెంటు రహదారిపైకి చేరడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వలేటివారిపాలెం : వర్షాలకు మిరప, మినుము, పొగాకు తదితర పంట పొలాల్లోని పల్లపు ప్రాంతంలో ఇప్పటికే వర్షపునీరు నిలిచిందని రైతులు తెలిపారు. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిస్తే సాగు చేసిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని మిరప, పొగాకు రైతులు చెబుతున్నారు.



గుడ్లూరు- I సచివాలయంలో ఇలా..



వలేటివారిపాలెం ఎస్సీకాలనీ వద్ద రోడ్డుపై వరద

భారీ వర్షం.. ప్రజలకు కష్టం



జలమయమైన ట్రంకు రోడ్డు



పెదపవని నుంచి వచ్చే మార్గంలో చప్టాపై ప్రవహిస్తున్న వరద

న్యూస్‌టుడే, కావలి, కావలి గ్రామీణం

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వీధులన్నీ గోదారులయ్యాయి. కావలిలో ఆరు సెంటీమీటర్ల మేరకు కురిసింది. పట్టణ శివారు దివ్యాంగులు, ఇందిరమ్మ, శివరామసుబ్బయ్య తదితర కాలనీలతో పాటు చెరువుకట్ట సంఘం, వెంగయగారిపాలెంలో నీరు చేరడంతో ప్రజలు అగచాట్లు పడ్డారు. ఆర్డీవో ఎం. వంశీకృష్ణ తుమ్మలపెంట, పల్లిపాలెం సముద్రతీర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. **ఉదయగిరిలో.. :** పట్టణంలో 67.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మురుగునీటి కాలువలు పొంగడంతో వీధుల్లో నీరు ఉద్ధృతంగా ప్రవహించింది. పంటలకు జీవం పోసింది. **వరికుంటపాడు:** మండలంలో ఉప్పు వాగు, పిల్లాపేరు వాగులు వర్షపు నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. బొగ్గు బట్టీల వద్ద పనులు చేస్తున్న గిరిజనులకు తూర్పురొంపిదొడ్ల సర్పంచి కూండ్ల నాగేశ్వరి, లక్ష్మీనరసయ్య సౌజన్యంతో ఆహార పొట్లాలను తెదేపా నాయకులు మార్నేని రామకృష్ణ, చల్లా నాగయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్ అందజేశారు.



ఉదయగిరి: వీధుల్లో ఉద్ధృతంగా ప్రవహిస్తూ..



వరికుంటపాడు: గిరిజనులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

తీరంలో అలజడి



కావలి గ్రామీణం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఆదివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం సముద్ర తీరంలో అలజడి రేగుతోంది. ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు బోట్లు, వలలు సురక్షిత ప్రాంతానికి తరలించారు.

కూలిన స్తంభాలు.. నిలిచిన విద్యుత్తు

కలిగిరి : మండలంలో భారీ వర్షం కురిసింది. వీధులు జలమయమయ్యాయి. ఎయిర్‌టెల్ ఆఫీసు దగ్గర భారీ మామిడి చెట్టు కూలింది. కొమ్మలు కరెంటు లెనుపై పడడంతో వరుసగా మూడు స్తంభాలు కూలిపోయాయి. కలిగిరమ్మ ఆలయం సెంటర్‌లో కరెంటు స్తంభం వాలింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది కలసి మరమ్మతులు చేయించారు. కలిగిరి పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర ఆధ్వర్యాన సచివాలయ సిబ్బంది పంచాయతీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలోకి నీరు చేరకుండా కాలువలు తీయించారు.



సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పేదలకు సూచిస్తున్న అధికారులు



పిల్లలకు దారేదీ ?

ఇవి పట్టణం వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో మన బడి- మన భవిష్యత్తు పథకంలో చేస్తున్న పనులు. మరో పాఠశాలకు చెందిన అదనపు తరగతులకు ఈ బడిలో స్థలం ఉందని గదులు నిర్మిస్తున్నారు. దీంతో ఇందులోని చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం నడిచేందుకు దారి కూడా లేకుండా నిర్మాణ సామగ్రి నిల్వ చేశారు. ఈ విషయమై మండల విద్యాధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అక్కడి వారికి ఫోన్ చేసి ఈ విషయమై చర్చిస్తామన్నారు. చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **-కావలి, న్యూస్‌టుడే**

ఆవుల సంచారం.. ప్రజలకు సంకటం



గ్రామంలో ఆవుల సంచారంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సీతారామపురం బస్టాండ్ కూడలిలో గుంపులుగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఆవు పొడవడంతో వృద్ధుడు మృతి చెందిన విషయం తెలిసిందే. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇవి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయాన్ని సర్పంచి భాగ్యకుమారి దృష్టికి తీసుకెళ్లగా కట్టడి చేస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, సీతారామపురం

కాలువ దారి ఇలా.. రాకపోకలెలా?



బెజవాడ పాపిరెడ్డి కావలి కాలువ గట్టు అధ్వానంగా తయారైంది. నీటి సరఫరాని పర్యవేక్షించేందుకు అధికారులు దీనిపై వెళుతుంటారు. రైతులు పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కంప చెట్లు పెరగడంతో పాటు గుంతలు పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. సోమశిల ఏఈ ప్రసాద్‌రావు మాట్లాడుతూ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మంజూరు కాగానే చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, జలదంకి**

తటాకాలకు నీరు.. తోటలకు మేలు

మండలంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వీధులనీ జలమయమయ్యాయి. సుమారు 8 సెం. మీ. వర్షపాతం నమోదయింది. దీంతో మెరకభాగంలోని వరద చెరువులకు చేరుతోంది. చాగొల్లు, చాకిచర్ల చెరువులకు కొద్దిపాటిగా.. మిగతా చెరువుల్లో గుంతల్లో నీరు చేరింది. ఈ వాన సరివి, జామాయిల్, మామిడి, సపోటా తోటలకు మేలు చేసింది. **- న్యూస్‌టుడే, ఉలవపాడు**



రాళ్లపాడు జలాశయం వద్ద అప్రమత్తం



తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రాళ్లపాడు జలాశయం నిరంతరం అప్రమత్తంగా ఉన్నట్లు జేఈ చంద్రమౌళి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో సోమవారం 40 మీ.మీ. వర్షం కురిసినట్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 8.6 అడుగులకు చేరిందన్నారు. వర్షం కురుస్తున్నందున నీటిమట్టం క్రమేణా పెరిగే అవకాశాలున్నాయన్నారు. **న్యూస్‌టుడే, లింగసముద్రం**

పొంగిన పైడేరు.. మునిగిన పొలాలు

భారీ వర్షంతో పైడేరు పొంగింది. పరిసరాల్లోని పొలాలు నీటమునిగాయి. ఎగువ ప్రాంతంలో వర్షాల కారణంగా వాగులో నీటి ప్రవాహం పెరిగింది. గ్రామంలోని వీధులు కూడా వర్షంతో జలమయమయ్యాయి. **-అల్లూరు, న్యూస్‌టుడే**



వైభవంగా గంధోత్సవం



సీతారామపురం : గంధాన్ని పంచిపెడుతున్న నిర్వాహకులు

సీతారామపురం, న్యూస్‌టుడే : గ్రామంలోని మహబూబ్‌సుభాని గంధోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దిలావర్‌సాహెబ్ వీధిలోని పెద్ద గౌస్ ఇంటి నుంచి జెండాలు, గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

నిమజ్జనానికి తరలిన అమ్మ వారు

ఉదయగిరి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో కొలువుదీరిన అమ్మవారి ప్రతిమను సోమవారం నిమజ్జనానికి తరలించారు. వాసుకి సుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ప్రత్యేక వాహనంపై ఉంచారు. అమ్మవారి విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగింపుగా గండిపాలెం జలాశయానికి తరలించారు.



వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే

కలిగిరి : గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రకటించారు. పల్లె పండుగ కార్యక్రమంలో మండలంలోని శిద్దనకొండూరులో రూ.14.40 లక్షలు, పోలంపాడులో రూ.10 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాల సమయంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, నాయకులు ఎం.చిరంజీవిరెడ్డి, బి.వి.రామారావు, బి.నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లె పండుగ

జలదంకి : సమస్యల పరిష్కారానికే పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం జమ్మలపాలెం, జలదంకి, తొమ్మిదో మైలు, చినక్రాక గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ 1.05 కోట్లతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో రూ.2.36 కోట్లతో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బుర్రి శ్రీవేణి, ఎంపీపీ జి.వెంకటరమణయ్య, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో బ్రహ్మయ్య, తెదేపా మండల కన్వీనర్ పి.మధురెడ్డి, గ్రామ నాయకులు పలువురు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఉలవపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. సోమవారం పెద్దపట్టపుపాలెం, చాకిచర్ల, చాగొల్లులో జరిగిన పల్లెపండగ కార్యక్రమంలో రూ.92లక్షల అంచనాలతో ప్రతిపాదించిన సిమెంటు రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పల్లెల ప్రగతికి పాటుపడాలని కోరారు. తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో విజయ పాల్గొన్నారు.



జలదంకి: శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సురేష్

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: శ్రీపూజ

గుడ్లూరు : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలకు గుడ్లూరు మండలంలోని తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్‌కలెక్టరు శ్రీపూజ అన్నారు. సోమవారం మండలంలోని సాలిపేట, కర్లపాలెం, రామాయపట్నం గ్రామాలను సబ్‌కలెక్టరు పరిశీలించారు. సాలిపేటలో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న గుడ్లూరు తహసీల్దారు స్వర్ణతో మాట్లాడారు. కర్లపాలెం, సాలిపేట ప్రజలకు వర్షతీవ్రత తెలియజేయాలన్నారు. కర్లపాలెంవాసుల్లో ఎవరైనా రక్షిత ప్రదేశానికి వచ్చేవారుంటే వెంటనే తరలించాలన్నారు. ఆహార, తాగునీటిని సిద్ధం చేసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో విధుల్లో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ఉలవపాడు :** మండలంలోని బాలకోటయ్య సంగం వాసులు పలువురు తలదాచుకున్న తుపాను షెల్టర్‌ను కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ పరిశీలించారు. సోమవారం ఒక్కరోజే 8 సెం.మీ. వర్షపాతం నమోదయింది. దీనికితోడు మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కాలనీ వాసులంతా ఇక్కడే ఉండాలని గ్రామస్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్‌తోపాటు తహసీల్దారు లావణ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



తుపాను షెల్టర్ వద్ద ఎస్టీలను వివరాలడుగుతున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

కావలి, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నూతన ఆర్డీవో ఎం.వంశీకృష్ణను ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కోరారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో ఆర్డీవో కలసి పరిచయం చేసుకున్నారు. జిల్లా నీటి నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీ మృదుల, ఎస్పీడీసీఎల్ ఏడీఈ రవికుమార్, సబ్‌రిజిస్ట్రార్ సుమలత కూడా కలిశారు.



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఆర్డీవో

కల్వర్టును ఢీకొన్న కారు.. వృద్ధుడి మృతి

దగదర్తి, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి ప్రమాదానికి గురవడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన వైనమిది. ఈ ఘటన మండలంలోని సున్నపుబట్టి సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన సారయ్య (70) బంధువులతో కలసి చెన్నైకి కారులో వెళుతున్నారు. సున్నపుబట్టి సమీపంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సారయ్య మృతి చెందగా అతని భార్య సునీతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

లింగసముద్రం, న్యూస్‌టుడే: మొగిలిచర్ల సమీపంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహమ్మద్ సుభానీ చెప్పారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

గుడ్లూరు: మండలంలోని కర్లపాలెం, రామాయపట్నం మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని గుడ్లూరు సీఐ మంగారావు ఆదేశించారు. సోమవారం కర్లపాలెం తీర ప్రాంతాన్ని పరిశీలించారు. సీఐ వెంట ఎస్సై వెంకటరావు ఉన్నారు. **సీతారామపురం:** వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శివకృష్ణారెడ్డి సూచించారు. సిద్ధేశ్వరం వెళ్లే మార్గంలోని వాగుల ఉద్ధృతిని పరిశీలించారు.

మాటల్లోనే మంజూరు.. నిధులివ్వక బేజారు!



మన్నేరుపై వంతెన

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

రెండేళ్ల క్రితం కేజీటీ(కందుకూరు-గుడ్లూరు-తెట్టు) రహదారిలోని మన్నేరుపై హైలెవెల్ వంతెన నిర్మించేందుకు రూ.25లక్షలతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వం ఈ పనులకు సంబంధించి కేవలం రూ.5లక్షలు మాత్రమే మంజూరు చేసింది. ఈ నిధులతో కేవలం ట్రైల్‌బోర్స్ మాత్రమే వేసి సాలిడ్ శ్యాంపిల్స్‌ను తీశారు. మిగిలిన నిధుల మంజూరుకు రెండేళ్లుగా ఎదురుచూసినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వంతెన నిర్మాణానికి కొద్దిపాటి భూమి అవసరం కావడంతో రైతుల నుంచి సేకరించాల్సి వస్తోంది. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు సర్వే చేసి రూ.6లక్షలు అవసరమని గతంలోనే నివేదికలు ఇచ్చారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లుగా నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారు. గతంలోని వంతెన ఎత్తు తక్కువగా ఉండటంతో రాళ్లపాడు జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వంతెన కూడా శిథిలావస్థకు చేరుతుంది. గతంలో అయిదు మీటర్ల పొడవుతో 14 దిమ్మెలు నిర్మించారు. నూతన ప్రతిపాదనల్లో 15మీటర్ల దూరంతో 20 పిల్లర్లు నిర్మించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. రెండేళ్ల క్రితం రూ.25కోట్లతో నిర్మించి ఉంటే ప్రస్తుతం పెరిగిన ధరలకు వ్యత్యాసంగా ఉండే సుమారు రూ.3కోట్లు ప్రభుత్వానికి అదనపుభారం కాకుండా ఉండేది. ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యంగా వంతెన నిలిచేది. నిధుల విడుదలలో ప్రభుత్వ జాప్యం కారణంగా వాహన చోదకులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

నిధులు ఇవ్వలేదు : అహ్మద్‌బాషా, ఏఈ, ఆర్‌అండ్‌బీ

గత ప్రభుత్వంలో రూ.25కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ట్రైల్‌బోర్స్‌కు మాత్రమే రూ.5లక్షలు మంజూరు చేయడంతో ఆ పనిని పూర్తి చేశాం. నిధులు విడుదల చేస్తే పనులు పూర్తి చేసేందుకు వీలుగా ఉండేంది. ప్రస్తుతం ధరలు పెరగటంతో ప్రతిపాదనలు పెరిగే అవకాశం ఉంది. అవసరమైన రహదారులకు ఇప్పటికే సుమారు రూ.100కోట్లకు పైగా ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. నిధులు మంజూరయిన వెంటనే పనులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నాం.

కర్షకులకు చేదోడుగా..

పరికరాల అందజేతకు ప్రభుత్వం నిర్ణయం



దుత్తలూరులో ఉన్న యంత్ర పరికరాలు

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

రైతులకు కూటమి ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలిచేందుకు పథకాలను అమలు చేస్తోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతు రథం పేరిట పెద్ద ఎత్తున అర్హులైన వారికి ట్రాక్టర్లు పంపిణీ చేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమాన్ని విస్మరించి రాయితీ పరికరాల పంపిణీ నిలిపేసి అస్మదీయులకే అందజేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలిగేలా టార్పాలిన్ల దగ్గర నుంచి పవర్ స్ప్రేయర్ల వరకు రాయితీపై అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈమేరకు అమలుకు సన్నాహాలు చేస్తున్నారు.


యాంత్రీకరణకు

సాగులో యాంత్రీకరణ పెరుగుతోంది. కూలీల కొరతను అధిగమించడానికి యంత్ర పరికరాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం రైతులకు పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, రొటోవేటర్లు, టార్పాలిన్లు అందజేసింది.

వైకాపా ప్రభుత్వంలో ఇలా...

గత తెదేపా ప్రభుత్వం వ్యక్తిగతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలను అందించేది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విధానానికి స్వస్తి పలికి వైఎస్సార్ యంత్ర సేవ పేరిట అమలు చేసింది. ఇందులో రైతు మిత్ర గ్రూపులను ఏర్పాటుచేసి పరికరాలను అందించింది. అధికార పార్టీ అనుయాయులకే ప్రయోజనం చేకూరుతుంది. ఈనేపథ్యంలో ఎక్కువ మంది రైతులకు లబ్ధి కలిగేలా కూటమి ప్రభుత్వం రాయితీపై యంత్రాలను అందించడానికి కార్యాచరణ చేపట్టింది.

రైతులకు అన్యాయం : హజరత్‌రెడ్డి, రైతు, దుత్తలూరు



వైకాపా ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. గత తెదేపా హయాంలో అవసరమైన రైతులు వ్యక్తిగతంగా యంత్ర పరికరాలు కావాలంటే రాయితీపై వెంటనే అందించేవారు. కానీ వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో ఆ పార్టీకి చెందిన నాయకులు లాభపడ్డారే కానీ మిగిలిన రైతులకు ఒరిగిందేమీలేదు.

దసరా మామూళ్ల దందాపై విచారణ చేపడతాం

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలంలో దసరా పండగ సందర్భంగా విద్యుత్తుశాఖ సిబ్బంది మామూళ్లు వసూలు చేశారనే ఆరోపణలపై డీఈ రమేశ్‌చౌదరి విచారణకు ఆదేశించారు. 'ఈనాడు'లో ఈ నెల 14న 'దసరా మామూళ్ల దందా' శీర్షిక ప్రచురించింది. దీంతో స్పందించిన ఆయన ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బుజ్జయ్య



కోవూరు : సీపీఎం మండల కార్యదర్శిగా గండవరపు బుజ్జయ్యను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.శేషయ్య సోమవారం తెలిపారు. పట్టణంలోని సీతాపోలయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన మండలస్థాయి భేటీలో ఆయనను ఎన్నుకున్నట్లు వివరించారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ఆర్థిక సాయం అందజేత

అనంతసాగరం, న్యూస్‌టుడే: పడమటి కంభంపాడు ఎస్సీ కాలనీకి చెందిన నీరుకట్టు జయమ్మకు హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంపాలై ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న సంఘం వ్యవస్థాపకులు వెంకట రమణారెడ్డి రూ.10 వేలు అందజేశారు. సభ్యులు మురళి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని ప్రాజెక్టు కాలనీ, హిల్ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. దీని వల్ల వర్షాకాలంలో రాత్రి వేళ బయట సంచరించాలంటే ఇబ్బందిగా ఉంటోంది. **- ప్రసాద్, సోమశిల గ్రామం**

సమాధానం: ప్రాజెక్టు, హిల్ కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

- రమేష్, ఈవోపీఆర్డీ అనంతసాగరం

వరి రైతుల ఆందోళన

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఎంతో శ్రమకోర్చి రూ.వేల పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఇంటికి వచ్చే సమయంలో వర్షం ముంచెత్తుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అనంతసాగరం మండలం పరిధిలో 13,500 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాధారణ వరి విస్తీర్ణం సుమారు 2,400 ఎకరాల్లో 2,250 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో 1,600 ఎకరాల్లోని వరి కోతలు ముగియగా 650 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో



ధాన్యం తడవకుండా నీటిని పక్కకు మళ్లిస్తున్న రైతు

కురుస్తున్న వాన రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని బెడుసుపల్లి, పాతదేవరాయపల్లి, కచిరదేవరాయపల్లి, వెంగంపల్లి, కొత్తపల్లి, కాకూరువారిపల్లి గ్రామాల్లో పది రోజులుగా వరి కోతలు జరుగుతుండగా మరి కొద్దిమంది ఈ నెలాఖరుల్లో కోతలు కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వానకు పంట నేల వాలింది. మరికొన్ని చోట్ల వరి పంట కోయగా, దానిని కుప్పలు పెట్టేందుకు కూలీలు దొరక్కపోవడంతో పొలంలో ఉండిపోయింది. మరోపక్క రోడ్డుపై నిల్వ చేసుకున్న ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

పొలంలో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలి

మండల పరిధిలో సుమారు 650 ఎకరాల్లో వరి పంట కోత దశలో ఉండగా, 60 ఎకరాల మినుము శాఖీయ దశలో ఉంది. తుపాను ప్రభావం వల్ల మూడు రోజుల పాటు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశముంది. ఈ నేపథ్యంలో పొలంలో నీరు నిలబడకుండా గట్లు తీసి బయటకు వెళ్లేలా చూసుకోవాలి. వరి పైరు వాలిపోయి ఉంటే పక్క పక్కన ఉండే మూడు నుంచి నాలుగు కుదుర్లు కలిపి కట్టుకొని నిలబెట్టుకోవాలి.

– శ్రీధర్ రెడ్డి, వ్యవసాయాధికారి, అనంతసాగరం

ఎగువన పడవలు.. దిగువన పెనుముప్పు

భారీ వరదలొస్తే ఇక అంతే సంగతులు



ఈ లంగరు.. పడవను ఆపగలదా?

సంగం, న్యూస్‌టుడే: నాలుగు రోజులపాటు భారీ వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమై పలు చర్యలు చేపట్టింది. పరివాహక పెన్నానదికి, దాని ఉపనదులకు భారీ వరద ప్రవాహాలు వస్తే సంగం, నెల్లూరు బ్యారేజీల ఎగువ భాగంలో పూడిక తొలగింపునకు తీసుకొచ్చిన భారీ పడవలతో పెనుముప్పు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. దీని గురించి ఎలాంటి చర్యలు లేకపోవడం ఆందోళనకరం.

పనులు పూర్తయినా..

సంగం బ్యారేజీ ఎగువ భాగంలో సంగం, పొదలకూరు మండలం సూరాయపాళెం.. నెల్లూరు బ్యారేజీ ఎగువ భాగంలో కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్ద పూడిక తొలగించేందుకు తొలిసారిగా పడవలు ఏర్పాటు చేశారు. సంగం, నెల్లూరులో సుమారు 25 నుంచి 50టన్నుల బరువైన పడవలు ఆరు కొప్పున, సూరాయపాళెంలో రెండు.. మొత్తం 14 ఉన్నాయి. పూడిక తొలగింపు పనులు పూర్తయిన తరువాత వాటిని అక్కడే గట్టున పెడుతుంటారు. వాటికి వేస్తున్న లంగరు అంతంతమాత్రంగా ఉంది.

రాయలసీమలో కురిస్తే..



సంగం బ్యారేజీ

పెన్నానదిలో ఆకస్మికంగా భారీ వరదలు వస్తుంటాయి. సోమశిల జలాశయంలో ప్రస్తుతం దాదాపు 52 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దాని ఎగువ భాగంలోని రాయలసీమ ప్రాంతంలో అతి భారీ వర్షాలు వస్తే పెన్నా నదితోపాటు, దాని ఉపనదులైన కుందు, చెయ్యేరు, సగిలేరు, గుంజన వాగు ఉద్ధృతంగా ప్రవాహాలు సోమశిలకు చేరతాయి. అప్పుడు అక్కడ నుంచి దిగువకు విడిచిపెడితే సంగం, నెల్లూరు బ్యారేజీలను దాటుకుని సముద్రానికి చేరతాయి. సంగం వద్ద బీరాపేరు, బొగ్గేరు వాగులు పెన్నాలో ఉద్ధృత ప్రవాహాలతో కలుస్తాయి. దాంతో వేగం పెరిగే అవకాశం ఉంది.

సాధారణ నిల్వకు మాత్రమే ఇది ఉపయోగపడుతోంది.

బ్యారేజీ గేట్లు తెరవాల్సిందే

వరద ప్రవాహం భారీగా వస్తే సంగం బ్యారేజీ గేట్లు తెరవాల్సి వస్తుంది. అప్పుడు పెరిగే వేగానికి దాని ఎగువ భాగంలో సుమారు రెండు కి.మీ.ల దూరంలోని పడవలు ముందుకు కొట్టుకుపోయే అవకాశం స్పష్టంగా ఉంది. అప్పుడు వాటితో బ్యారేజీ నిర్మాణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. దీంతోపాటు పక్కనే ఉన్న సంయుక్త రెగ్యులేటర్‌కి ముప్పు వాటిల్లనుంది. అధికారులు ఇప్పటి వరకు ఈ విషయం గురించి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా పడవల యజమానులు, సిబ్బందితో మాట్లాడి వాటిని కదలకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు. జలవనరుల శాఖ ఏఈ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. తగు చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: భర్త మందలించాడని పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కొత్తూరులో రొయ్యల గుంతల వద్ద ఎర్ర మునెమ్మ(40), సుబ్రహ్మణ్యం దంపతులు కాపలా ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం భర్త మందలించాడని మనస్తాపం చెందిన మునెమ్మ పురుగు మందు తాగింది. వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

తెదేపా నాయకుడి కన్నుమూత

పొదలకూరు : తెదేపా సీనియర్ నాయకుడు వెంపులూరు పుల్లయ్యగౌడ్ (78) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. సోమవారం ఆయన అంత్యక్రియల్లో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, పొదలకూరు మండలాధ్యక్షుడు మస్తాన్‌బాబు, మరుపూరు మాజీ ఎంపీసీటీ సభ్యుడు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



రామతీర్థంలో సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మోహన్‌రావు

విడవలూరు: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈవో మోహన్‌రావు తెలిపారు. విడవలూరు మండలం రామతీర్థం తీరప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. తుపాను షెల్టర్లను పరిశీలించారు. రానున్న మూడు రోజులు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. వలలు, పడవలను సురక్షిత ప్రాంతంలో ఉంచాలన్నారు. తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో నగేశ్‌కుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉత్తర, దక్షిణ కాలువలకు జలాల విడుదల తగ్గింపు

అనంతసాగరం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దృష్ట్యా సోమశిల జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు తగ్గింపు చేశారు. ఉత్తర కాలువకు 540 నుంచి 40 క్యూసెక్కులు, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 8,500 నుంచి 6,000 క్యూసెక్కులకు కుదించి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 7,500 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. జలాశయంలో 317.146 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 77.988కి 52.012 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 6,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 270 క్యూసెక్కులు ఆవిరవుతుండగా, 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

సహచట్టం బోర్డులేవీ?



కోవూరు పట్టణంలోని ర.భ. డీఈ, కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు ఏఈల కార్యాలయాలున్నాయి. కానీ, సహచట్టం బోర్డు లేకపోవడంతో ఈ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సంబంధిత అధికారులు ఎవరో తెలియక అవస్థలు పడుతున్నారు. తమ గ్రామాల్లో రోడ్లు ధ్వంసమవడంతో కార్యాలయంలో ఫిర్యాదు చేద్దామంటే అటెండర్లు తప్పా అధికారులు కనిపించడం లేదు. **-న్యూస్‌టుడే, కోవూరు**

పశువైద్యశాలను చుట్టుముట్టిన వరద

విడవలూరు, న్యూస్‌టుడే: ఈ చిత్రంలో చెరువులా కనిపిస్తోంది విడవలూరులోని పశువైద్యశాల. సోమవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి నీరు పశువైద్యశాల ఆవరణలో చేరింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేకపోవడంతో పశువైద్యశాల చెరువును తలపిస్తోంది. వైద్యశాలకు వచ్చే పశుపోషకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి వాణి మాట్లాడుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



జగనన్న కాలనీ.. కష్టాల కడలి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని లోతట్టు జగనన్నకాలనీల్లో పూర్తిగా మౌలిక వసతులు కల్పించకపోయేసరికి పలుచోట్ల వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేక నిలిచింది. పలుచోట్ల విద్యుత్తు సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జగనన్నకాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు సమస్యలు పరిష్కరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నీటి సరఫరా జరిగేదెన్నోడో..?

చేజర్ల, న్యూస్‌టుడే: చేజర్ల, మడపల్లి గ్రామాలకు పెన్నానది నుంచి నీటిని సరఫరా చేసేందుకు తలపెట్టిన తాగునీటి పథకం నిధుల కొరతతో నిలిచి పోయింది. పెన్నానదిలో గొట్టపు బావులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి నీటిని తరలించి గ్రామాల్లోని తాగునీటి పథకాలకు అనుసంధానం చేసేందుకు రూ.130 కోట్లతో గత ప్రభుత్వం పనులు ప్రారంభించింది. నది నుంచి గ్రామాలకు పైపులైన్ల ఏర్పాటు, గొట్టపు బావుల తవ్వకం పూర్తయింది. విద్యుత్తు సరఫరా, తాగునీటి ట్యాంకులతో అనుసంధానం, వాల్వుల ఏర్పాటు మిగిలి ఉంది. చేసిన పనులకు చెల్లింపులు జరగని కారణంగా గుత్తేదారులు పనులు నిలిపేశారు.

చేజర్ల, మడపల్లి గ్రామాల్లో దాదాపు 6000 మంది జనాభా ఉన్నారు. చెరువుల్లో నీరు లేకపోవడంతో తాగునీటి బావులు అడుగంటాయి. బోర్ల నుంచి వచ్చే నీరు సరిపోవడం లేదు. చేజర్లలో క్రమపద్ధతిలో రెండు రోజులకోసారి నీటిని విడుదల చేస్తున్నారు. మడపల్లి చెరువు ఎండిపోవడంతో గ్రామంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతోంది. నీటి కొరత తీర్చేందుకు తలపెట్టిన పథకాలు పూర్తిచేస్తే గ్రామాల్లో సమస్య తీరుతుందని స్థానికులు చెబుతున్నారు. బకాయిలు చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపామని, అసంపూర్తి పనులు పూర్తి చేసి నీటి సమస్య లేకుండా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



తాగునీటి పథకాల కోసం తెచ్చిన పైపులు

వ్యాసరచనే మెట్టుగా లక్ష్య సాధన

న్యూస్‌టుడే, ఆత్మకూరు

వ్యాసరచన అభిరుచిగా ఆమె విద్యాభ్యాసం సాగించారు. ఆ నైపుణ్యమే ఆమెను పలు పోటీల్లో విజేతగా నిలపడమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా దోహదపడింది. పట్టుదలతో శ్రమించి 2023లో గ్రూప్-1 ఫలితాల్లో రెండో ర్యాంకు సాధించారు. ప్రస్తుతం శిక్షణ పూర్తిచేసుకుని ఆత్మకూరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు భూమిరెడ్డి పావని.

కడపజిల్లా మైదుకూరుకు చెందిన భూమిరెడ్డి గంగయ్య-లక్ష్మిలది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు. పావని మొదటి సంతానం. పాఠశాల స్థాయి నుంచి చదువులో ప్రతిభ చూపారు. బీటెక్ పూర్తిచేశారు. గ్రూప్ 1, 2లలో మొదటి ప్రయత్నంలో విఫలమైనా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రెండో ప్రయత్నంలో గ్రూప్1లో రెండో ర్యాంకు సాధించారు.



ఆర్డీవో పావని

బాధ్యతగా పనిచేస్తా

నా విజయానికి కుటుంబ సభ్యులు తోడ్పాటే కారణం. ఓటమి సమయంలో అంతర్మథనానికి గురైనా.. వారు వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా దోహదపడ్డారు. ఆత్మకూరు డివిజన్ అభివృద్ధిపై నాదైనా ముద్ర వేస్తా. రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తా. స్త్రీ, శిశు, వైద్యం, విద్యారంగాలల్లో మంచి సేవలు అందించేలా కృషి చేస్తా. పేదలు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారి సమస్యలను తెలుసుకుని వారికి న్యాయం జరిగేలా చూస్తాను.

- ఆర్డీవో భూమిరెడ్డి పావని

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు




పొదలకూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శయన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పోలేరమ్మ పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ

మనుబోలు : స్థానిక దేవాంగుల వీధిలో కొలువుదీరిన పోలేరమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ అమ్మవారి నూతన పంచలోహ విగ్రహం ప్రతిష్ఠించారు. అర్చకులు శ్రీనివాసులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

ప్రహరీల విధ్వంసం.. చదువులకు విఘాతం

కోవూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద అదనపు తరగతుల భవనాలను నిర్మించేందుకుగానూ పలుచోట్ల ప్రహరీలు, ముఖద్వారాలు ధ్వంసం చేశారు. నిర్మాణ సామగ్రిని పాఠశాలల్లోకి తరలించే వాహనాల కోసం వీటిని పగలగొట్టారు. కానీ, పనులు 70 నుంచి 80 శాతం వరకు పూర్తయినాగానీ గుత్తేదారులు తిరిగి వీటిని పునఃనిర్మించలేదు. దీంతో పశువులు, పందులు బడుల్లోకి వచ్చేస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. మధ్యాహ్నభోజన సమయాల్లో ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాటూరు, గుమ్మళ్లదిబ్బ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ముఖద్వారాలు పగలగొట్టడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కోవూరులోని ఎన్ఎస్ఆర్ కాలనీలో ప్రహరీలు ధ్వంసం చేయడంతో విద్యార్థులకు రక్షణ కరవైంది. కోవూరు ఎస్సీ కాలనీ, నేతాజీనగర్, పెళ్లకూరుకాలనీల్లో పాఠశాలలకు అసలు ప్రహరీలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుమీద రణగొణ ధ్వనులతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బోధపడడం లేదని బాలబాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంఈవో-2 చెంచులక్ష్మి మాట్లాడుతూ హెచ్ఎంలతో చర్చించి.. ప్రహరీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.





ఎన్ఎస్ఆర్ కాలనీలో పాఠశాల ప్రహరీ ధ్వంసం

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

పెరుగుతున్న నీటిమట్టం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని కండలేరు జలాశయానికి క్రమేణా నీటి మట్టం పెరుగుతుంది. సోమశిల నుంచి నీరు చేరుతోంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 1525 క్యూసెక్కుల నీటిని అధికారులు సోమవారం విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 31.563 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు ఏఈ కె.తిరుమలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అప్రమత్తత అవసరం

సైదాపురం, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శివకుమార్ సూచించారు. సోమవారం మండలస్థాయిఅధికారులు, గ్రామకార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తుపాను ప్రభావం వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. లోతట్టుప్రాంతాల్లో ఆస్తి,ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. తహసీల్దారు రమాదేవి, డిప్యూటీ తహసీల్దారు అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రాపూరు, సైదాపురం: తుపాను కారణంగా మండలంలో తేలికపాటి వర్షపు జల్లులు కురిశాయి. రాపూరులో రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. సైదాపురం మండలంలో ఎడతెరిపిలేని వర్షం కారణంగా నీరు పొలాల్లో చేరింది. చెరువులు నిండితే వరిపంట సాగుచేసుకోవచ్చని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆలయ భూముల కౌలు వేలం 16న

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోన ఆలయానికి అనుసంధానంగా భూముల కౌలు, ఇనుప సామగ్రి వేలంపాట ఈ నెల 16 నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ పి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలువాయి మండల కుల్లూరు అచ్యుతస్వామి ఆలయ భూముల కౌలుకూ వేలం వేస్తామన్నారు. పెంచలకోన ఆలయ ప్రాంగణంలో జరిగే ఈ వేలంపాటల్లో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చన్నారు.

మండల సర్వసభ్య సమావేశం 23న

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 23న జరుగుతుందని ఎంపీడీవో భవాని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎడతెరపిలేని వర్షం



మర్రిపాడు: కేతామన్నేరు వాగు వద్ద పోలీసులు

సంగం,న్యూస్‌టుడే: సంగం ఆనకట్ట వద్ద 12మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తరువాత నుంచి జోరు పెరగడంతో గరిష్ఠంగా 113.2 మి.మీకి చేరింది. వీర్లగుడిపాడు, జండాదిబ్బ, కోలగట్ల ఇళ్లలోకి చేరింది. **మర్రిపాడు:** మండలంలోని బొగ్గేరు, కేతామన్నేరు వాగు పొంగి ప్రవహించాయి. 63.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వాన పడితే మిరప పంట, పొగాకు నారుమడులు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అనుమసముద్రంపేట: భారీ వర్షం కారణంగా ఏఎస్‌పేట బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలిచింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో ప్రసన్న పరిశీలించి పొక్లెయిన్‌తో కాలువ తీయించి వర్షపు నీటిని తరలించారు.

ఇందుకూరుపేట: సముద్రతీర, పెన్నా తీర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష పేర్కొన్నారు. సోమవారం మైపాడు, గంగపట్నం, రాముడుపాలెం, కుడితిపాలెం, ముదివర్తిపాలెంలో పర్యటించారు. ఆమె వెంట తహసీల్దారు కృష్ణప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు. **బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పెన్నా తీరప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు గిరిజనకాలనీల్లో నీరు చేరి.. ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ పి.శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో శ్రీహరి పాల్గొన్నారు. కొడవలూరులో తహసీల్దారు స్ఫూర్తి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంపీడీవో సుబ్బారావు, ఎస్సై కోటిరెడ్డి పాల్గొన్నారు. **విడవలూరు :** విడవలూరులో సోమవారం ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని తహసీల్దారు చంద్రశేఖర్ సూచించారు. ముదివర్తిలో వెంకటేశ్వర్లుకు చెందిన వరి పొలం మునిగింది. **ఆత్మకూరు, సంగం :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో పావని హెచ్చరించారు. పెన్నానది పరివాహక మండలాలైన ఆత్మకూరు, సంగం, అనంతసాగరం మండలాల్లో లోతట్టు గ్రామాలను పరిశీలించారు. అప్పారావుపాళెం, వీర్లగుడిపాడు, కోలగట్ల గ్రామాల ప్రజలతో మాట్లాడారు. పడమటికంభపాడు ఎస్టీకాలనీ గృహాలు కాలం చెల్లి ఉండటంతో ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేశారు. సంగం సీఐ వేమారెడ్డి, ఎంపీడీవో షాలెట్టు తదితరులున్నారు.

మనుబోలు : మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ఎంపీడీవో జలజాక్షి సోమవారం పర్యటించారు. కొలనుకుదురు, కట్టువపల్లిలోని ప్రజలను అప్రమత్తం చేశారు. సర్పంచి వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శులు బాబురెడ్డి, దీపిక, తెదేపా నాయకులు సునీల్‌రెడ్డి పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు సుబ్బయ్య సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మనుబోలులోని గిరిజనకాలనీని పరిశీలించారు. **వెంకటాచలం :** తీరప్రాంత గ్రామమైన తిరుమలమ్మపాళెం వద్ద ఉప్పుకాలువలో వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, సీఐ సుబ్బారావు వెళ్లి పరిశీలించారు. **ఆత్మకూరు :** ఆత్మకూరులో జోరుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి తుపాను ప్రభావంతో పాఠశాలలకు సెలవు ఇచ్చారు. వీధులు జలమయం అయ్యాయి. **ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల :** ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు సీఐ గంగాధరరావు తెలిపారు. సోమవారం బండారుపల్లి, దేపూరు, జంగాలపల్లిలో ఆయన పర్యటించారు. అనంతసాగరం మండలం కచిరదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి, పాతదేవరాయపల్లి గ్రామాలను ఆయన పరిశీలించారు. చేజర్ల మండలం పెన్నాతీర గ్రామాల్లో సంగం సీఐ వేమారెడ్డి పర్యటించారు. ప్రజలంతా నిత్యావసరాలు సిద్ధం చేసుకుని భద్రపరుచుకోవాలని తహసీల్దారు మస్తానయ్య సూచించారు. **కోవూరు :** పట్టణంలోని పలు వీధుల్లో నీరు నిల్వ ఉండడంతో కాల్వలను తలపించాయి. పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఏఎస్‌పేట బస్టాండ్‌లో నిలిచి వర్షపు నీటిని తొలగిస్తున్న అధికారులు



మనుబోలు: మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్బయ్య



ఆత్మకూరు: తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో..



సంగం: కోలగట్లలో మహిళతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



బుచ్చి: సమీక్షా సమావేశంలో పోలీసులు, అధికారులు



విడవలూరులో జలమయమైన రోడ్లు

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనిచేస్తున్నారని తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్‌లో పల్లె పండగ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఆమంచర్ల గ్రామంలో రూ.20 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన జరిగింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపుమేరకు నియోజకవర్గంలో వారం రోజుల పాటు పల్లెపండగ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బి.గంగా భవాని, ఎంపీడీవో శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చర్యలు: కమిషనర్



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ సూర్యతేజ



ఎంజీమాల్ వద్ద కాలువపై ఆక్రమణల తొలగింపు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు నగరపాలకసంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి.. సిబ్బందిని నియమించారు. జేసీబీల సాయంతో పూడికతీత, ఆక్రమణలను తొలగిస్తున్నారు. అండర్ బ్రిడ్జిల్లో మోటార్ల సహాయంతో నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. కేవీఆర్ పెట్రోలు బంకు నుంచి మెయిన్‌రోడ్డులోని ట్రంకురోడ్డు పరిసర ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న దుకాణాల మెట్లు, ర్యాంపులు, చిన్నచిన్న నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. నగరపాలకసంస్థ పరిధిలో అన్ని ప్రధాన కాలువలతో పాటు డ్రైన్లలో పూడికతీత పనులను చేపట్టడంతో వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకులు లేవని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం సహాయ చర్యలను పర్యవేక్షించారు. భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నగరవ్యాప్తంగా 13 పునరావాస కేంద్రాలు: మేయర్



కమాండ్ కంట్రోల్ విభాగాన్ని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా బాధితులకు సత్వర స్పందన అందించి అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నట్లు మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు. సోమవారం కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ నగరవ్యాప్తంగా 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. లోతట్టు ప్రాంతాల వారు వర్షాల నేపథ్యంలో స్థానికంగా సమస్యలు ఏర్పడితే 0861-2356777, 2316777 నంబర్లకు సమాచారం అందించి సహాయం పొందాలని సూచించారు. అనంతరం హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే సహాయ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. వృద్ధుడి మృతి

దగదర్తి, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి ప్రమాదానికి గురవడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘైనమిది. ఈ ఘటన మండలంలోని సున్నపుబట్టి సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన సారయ్య (70) బంధువులతో కలసి చెన్నైకి కారులో వెళుతున్నారు. సున్నపుబట్టి సమీపంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సారయ్య మృతి చెందగా అతని భార్య సునీతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చినుకు వణుకు..

కొద్దిపాటి వర్షానికే వీధులు, రోడ్లు, జలమయం



ఇది కాలువ కాదు.. స్వతంత్ర పార్కు వీధి

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

కుంభవృష్టి వర్షం కురిస్తే నెల్లూరు నగరం తట్టుకుంటుందా అంటే చెప్పలేమని నిపుణులు బదులిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే నగరవాసులు వణుకుతున్నారు. సోమవారం నాటి వర్షానికి పలు వీధులు జలమయం అయ్యాయి. అల్పపీడనం కారణంగా ఇక భారీ వర్షాలు కురిస్తే ముంపు తప్పదని ఆందోళన చెందుతున్నారు. నగరంలో అంకణం స్థలం కొనాలంటే ప్రాంతాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు ధర పలుకుతోంది. అదే కొందరు భూబకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కోట్లాది రూపాయల విలువైన రెవెన్యూ, నగరపాలక సంస్థ, ఇరిగేషన్‌శాఖలకు చెందిన స్థలాలపై కన్నేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. కొంత కాలం తరువాత గుట్టుగా అమ్ముతున్నారు. దీర్ఘకాలికంగా జరుగుతున్న భూదందాలో కొందరు నాయకులు, ఉన్నతాధికారుల పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. ఇదే పరిస్థితి కొనసాగితే నగరంలో ముంపు సమస్య తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎటు చూసినా ఆక్రమణలే..

నగరంలో 54 డివిజన్లు ఉండగా.. దాదాపు 9 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. నగరం నుంచి 14 పంట కాలువలు వెళుతున్నాయి. ఒక్కో కాలువ వెడల్పు 60 అడుగులు ఉండాల్సి ఉండగా.. ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. వీటితో పాటు కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ కారణంగా వర్షపునీరు ప్రవహించే పరిస్థితి లేదు. ఆక్రమణల కారణంగానే 2015, 2021, 2022లో నగరం ముంపు బారిన పడింది. ప్రస్తుతం భారీ వర్షాలు పడితే ముంపు సమస్య తప్పదు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రహదారులపై నీరు

నెల్లూరు నగరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. జనజీవనం స్తంభించింది. నగరంలోని సండేమార్కెట్, గాంధీబొమ్మ సెంటరు, ఏసీసెంటరు, జీఎన్‌టీ రోడ్డు, ఇరుగాళమ్మ సంఘం, శ్రామికనగర్, ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచింది. మురుగు నీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు రోడ్ల పైనే నిలిచిపోతోంది. చిరు వ్యాపార దుకాణాలు మూతపడ్డాయి. కార్మికులు పనులు లేక అవస్థలు పడ్డారు. ఉద్యోగులు వర్షంలో తడుస్తూనే విధులకు హాజరయ్యారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు రోడ్లపై నిలిచింది. పలు ప్రధాన రహదారులు, కూడళ్లలో, ఖాళీ స్థలాలలో వర్షపు నీరు చేరింది.



రేబాలవీధి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు, మురుగునీరు



చెరువును తలపిస్తున్న గాంధీబొమ్మ సెంటరు

ఇరుగాళ్లమ్మ సంఘానికి నీటి కష్టం



నెల్లూరు(జడ్పీ): నగరంలోని ఇరుగాళ్లమ్మ సంఘంలో నివాసం ఉండే వారు వర్షంతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ నీరు చేరి ఇళ్లల్లోని వారు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నగరం నుంచి జొన్నవాడ వెళ్లే రోడ్డు జలయమం అయింది. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యర్థాలు తొలగించకపోతే ఎలా?

నెల్లూరు నగరంలోని చిన్నబజారులో భారీగా చెత్త పేరుకుపోయింది. కుళ్లిపోయిన పండ్లు, వ్యర్థాలు వర్షానికి తడిచి దుర్వాసన వస్తున్నాయి. వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన పారిశుద్ధ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం కారణంగా దుర్గంధంగా తయారైంది. అధికారులు స్పందించి ప్రతి రోజూ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వ్యర్థాలను తొలగిస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



సారూ.. గుంతలు కనిపించవా?



నగరంలోని బట్వాడిపాళెం సెంటరులో రోడ్డు అధ్వానంగా తయారైంది. నాలుగు రోడ్ల కూడలిలో వర్షానికి గుంతలమయంగా తయారైంది. మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు గత కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. ఈ ప్రాంతం నుంచే ప్రతిరోజూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

ఏమరుపాటుగా ఉంటే ప్రమాదమే

నగరంలోని బారకాసు సెంటరులో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కాలువపై మ్యాన్‌హోల్‌కు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. నాలుగు రోడ్ల కూడలి మధ్యలో ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చర్యలు చేపడతామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



భయపెడుతున్న భవనం



నెల్లూరు నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ భవనం పోర్టుకో పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతోంది. గతంలో భవనంలో మూడు ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. రెండింటిని మరోచోటుకు మార్చారు. పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయం ప్రస్తుతం ఇక్కడ నడుస్తోంది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది విధులకు రావాలంటే భయపడిపోతున్నారు. ప్రస్తుతం వర్షం కారణంగా దెబ్బతిన్న పోర్టుకోకు ఉరుస్తోంది. దీనివల్ల ఎప్పుడు కూలుతుందోని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాన్ని మార్చాలని సిబ్బంది కోరుతున్నారు. –ఈనాడు, నెల్లూరు

ఇలా ఉంటే వ్యాధులు రావా..?

నగరంలోని పలు కాలువల్లో మురుగు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారుతోంది. మూలాపేట సీసీఏ పాఠశాల వద్ద కాలువలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటి వల్ల మురుగు, వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు ఆటంకం కలుగుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(బృందావనం)



ఉత్తర, దక్షిణ కాలువలకు జలాల విడుదల తగ్గింపు

అనంతసాగరం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దృష్ట్యా సోమశిల జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు తగ్గింపు చేశారు. ఉత్తర కాలువకు 540 నుంచి 40 క్యూసెక్కులు, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 8,500 నుంచి 6,000 క్యూసెక్కులకు కుదించి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 7,500 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. జలాశయంలో 317.146 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 77.988కి 52.012 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 6,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 270 క్యూసెక్కులు ఆవిరవుతుండగా, 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

అధికారులకు పట్టని నెల్లూరు - తాటిపర్తి రోడ్డు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్లను విస్మరించింది. గత ప్రభుత్వ హయాంలో నిధులు లేక అన్ని శాఖలు మిన్నకుండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని శాఖల్లో కదలిక వచ్చింది. ఆర్‌అండ్‌బీలో ఇంకా పనులు సాగడం లేదు. కనీసం రోడ్డు మార్జిన్లను కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇందుకు నెల్లూరు- తాటిపర్తి రోడ్డే ఉదాహరణ. ఈ రహదారిలో మార్జిన్ అసలు కనిపించకపోగా. . కంపచెట్లు సగం రోడ్డుకు పెరిగిపోయాయి. తాటిపర్తి రహదారిలో ఆనాటికంట్రిగ వద్ద చెట్లు రోడ్డుపైకి వచ్చాయి. రాత్రి పూట ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన మార్జిన్ సూచిక కంప చెట్ల మాటున ఉంది. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మార్జిన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



కంపచెట్లలో మార్జిన్ సూచిక బోర్డు





రాకపోకలకు కష్టాలే

నెల్లూరు నగరంలో సోమవారం కురిసిన భారీ వర్షంతో వీధులు జలమయం కావడంతోపాటు ట్రాఫిక్ సమస్య నెలకొంది. ట్రంకు రోడ్డు మొత్తం వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కేవీఆర్ పెట్రోల్ బంకు ప్రాంతంలో సమస్య అధికంగా ఉంది. పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ, గాంధీబొమ్మ సెంటరులో సమస్య పరిష్కరించే వారు లేక వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉంటే సమస్య తలెత్తేదికాదని వాహనదారులు తెలిపారు. – ఈనాడు, నెల్లూరు

సుబేదారుపేటలో అవస్థలే

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: నగరంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. నగరంలోని ముఖ్య ప్రాంతమైన సుబేదారుపేటో మోకాళ్ల లోతుగా నీరు నిలిచి స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నీరు వెళ్లే వసతి లేక సమస్య నెలకొంది.

ఊరి వెంబడి అక్రమం.. ప్రమాదం

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం



కల్లూరుపల్లి కొత్త చెరువులో గుంతలు

అక్రమార్జనే ధ్యేయంగా కొందరు గ్రావెల్, మట్టి కోసం చెరువులు, కుంటలు లోతుగా తవ్వుతున్నారు. అందులోని మట్టిని రోడ్లకు, వెంచర్లకు ఉపయోగిస్తున్నారు. ఈ అక్రమం గత వైకాపా ప్రభుత్వంలో పెద్ద ఎత్తున జరిగింది. చెరువులు, కుంటల్లో దాదాపు పది అడుగుల లోతులో గుంతలు తీశారు. అవి ప్రస్తుత వర్షాలకు నీటితో నిండిపోతున్నాయి. సమీప గ్రామాల పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి పడిపోయే ప్రమాదం ఉంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కల్లూరుపల్లి కొత్త చెరువు, కొర్లపూడి చెరువు, పక్క నియోజకవర్గం సర్వేపల్లి, కావలి చెరువుల్లో గ్రావెల్ తవ్వకంతో పెద్ద ఎత్తుల గుంతలు ఏర్పడ్డాయి. కల్లూరుపల్లి కొత్త చెరువు సమీప ప్రాంత గ్రామాల పిల్లలు ఆటలాడుతూ కొందరు, బహిర్భూమికని వెళ్లి అప్పుడప్పుడు గుంతల్లోపడి మృతిచెందారు. ఇలా పలు దఫాలుగా జరిగిన ప్రమాదంలో అయిదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.. ఇదే పరిస్థితి జిల్లాలోని పలు మండలాల్లో నెలకొంది. ప్రమాదాలు జరిగిన సమయంలో స్థానికులు ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా చెరువులో గ్రావెల్, మట్టి తవ్వకాలు చేయాలంటే రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్‌శాఖ అనుమతులు తీసుకోవాలి. అధికారులు ఇచ్చిన కొలతల మేరకు తవ్వకాలు చేయాలి. ఇవన్నీ జరగని కారణంగా చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావం నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉదయం నుంచి విస్తృతంగా పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవసరం ఉన్నా వెంటనే సంప్రదించాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచే అవకాశాలు ఉండడంతో అక్కడ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందిని కోరారు. భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో చెరువులు, కాలువలను అధికారులు పర్యవేక్షించాలన్నారు.

వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్‌గా నియమితులైన అబ్దుల్ అజీజ్‌ను నెల్లూరులోని ఆయన నివాసంలో శాసనమండలి సభ్యులు మహ్మద్ రుహుల్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: శ్రామికనగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయి... మురుగునీరు ముందుకు కదలడం లేదు.– సుదర్శనమ్మ

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? స్టోన్‌హౌస్‌పేట హుడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో మూడురోజులుగా చెత్త పేరుకుపోయింది. – స్థానికులు

✓ సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? మనుమసిద్ధినగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. – నారాయణరావు

✓ పందులను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

జూద స్థావరంపై పోలీసుల దాడులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని కిసాన్ నగర్‌లో ఓ ఇంట్లో జూద స్థావరంపై నవాబుపేట పోలీసులు దాడులు చేశారు. జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.89,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని స్కూటర్ ఢీకొనడంతో మృతి చెందారు. ఈ ఘటనపై సోమవారం నెల్లూరుగ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి కథనం మేరకు.. ధనలక్ష్మీపురం నుంచి నెల్లూరుకు వస్తున్న ద్విచక్ర వాహనం ఓ వ్యక్తిని ఢీకొంది. ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న నెల్లూరుగ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

తెరపై ఈనాడు



ఎం–1 సినిమాస్– స్క్రీన్1.. వెట్టయ్యాన్, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. విశ్వం, మార్టిన్, స్పైస్ సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్2.. మార్టిన్, స్క్రీన్3..మానాన్న సూపర్ హీరో, జిగ్రా, విక్కీ విద్యాకా వోవాలా వీడియో, స్క్రీన్4..వెట్టయ్యాన్, స్క్రీన్5..దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. విశ్వం,మార్టిన్, స్క్రీన్3..వెట్టియ్యాన్, స్క్రీన్4.. మానాన్న సూపర్‌హీరో, జిగ్రా, మార్టిన్, సిరి మల్టీప్లెక్స్..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. వెటయ్యాన్, స్క్రీన్3..విశ్వం, స్క్రీన్4.. మార్టిన్

రహదారుణం.. కాలువలు అధ్వానం

న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

నెల్లూరు నగరానికి నడిబొడ్డున ఉన్న గాంధీనగర్‌ను సమస్యలు చుట్టుముట్టాయి. గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పక్కనే పొగతోట, విజయ మహల్‌గేట్‌కు మధ్యలో ఈ ప్రాంతం ఉండగా.. పలు వీధుల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మూడేళ్లుగా కనీసం ప్యాచ్ పనులు కూడా చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ కార్పొరేషన్‌కు చెందిన పెద్ద పార్కు ఉంది. దీన్ని గాంధీ పార్కుగా, పెద్దల పార్కుగా పిలుస్తారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, పెద్దలు ఇక్కడకు వస్తుంటారు. చెడు వ్యసనాలకు బానిసైన కొందరు పార్కులోకి ప్రవేశిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేతిపంపు పరికరాలు మాయం

సైడ్ కాలువలు తరచూ పొంగి పొర్లుతున్నాయని, 50 ఏళ్ల క్రితం నిర్మించిన చిన్న కాలువలు కావడంతో మురుగు సరిగా వెళ్లడం లేదు.



దెబ్బతిన్న ప్రధాన రోడ్డు

స్థానిక షిర్డీ సాయినాథుని దేవస్థానం ప్రవేశ మార్గం తరువాత తరచూ రోడ్డుపైకి మురుగు

గాంధీనగర్‌లో సమస్యల తిష్ఠ..



మాయమైన బోరు హెడ్

నీరు వస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అక్కడ ఉన్న చేతి పంపు అడుగు భాగం తుప్పుపట్టిపోయి దాదాపు రెండేళ్లు గడిచింది. సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి కొత్త బోరు ఏర్పాటు చేశారు. మూడు మాసాలు గడిచే లోపే కొత్త బోరుపై హెడ్ తీసుకెళ్లి పోయారని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ● ఈ విషయంపై కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందిస్తూ రోడ్డు గుంతలకు త్వరలో ప్యాచ్ పనులు చేయిస్తామన్నారు.